ఆమే.. మా కంటి వెలుగు

- స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా కంటి సమస్య గుర్తింపు
- ఉచిత ఆపరేషన్‌తో కంటికి వెలుగులు
- ఉచితంగా 620 మందికి కంటి పరీక్ష, 152 మందికి ఆపరేషన్
- గతంలో మాకు ఎవరూ ఇంతసాయం చేయలేదు
- మా బిడ్డలా ఆలోచిస్తున్న మంత్రి రోజాకు రుణపడి ఉంటామన్న వృద్ధులు




కంటి ఆపరేషన్ చేసుకున్న వారికి సూచనలు ఇస్తున్న వైద్యసిబ్బంది, ఆపరేషన్ చేసుకున్న వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న మంత్రి రోజా

నగరి : వృద్ధాప్యంలో ఎక్కువ మంది కంటిచూపు సమస్యతోనే ఇబ్బంది పడుతుంటారు. ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉండడంతో కంటి సమస్యలతోనే జీవితాన్ని నెట్టుకొస్తుంటారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వృద్ధుల సమస్యను గుర్తించిన మంత్రి రోజా మళ్లీ వారు ప్రపంచాన్ని స్పష్టంగా చూడాలనే తలంపుతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. శంకర నేత్రాలయ వారితో చర్చించి ఎంతో ప్రయాసలకు ఓర్చి వారిని నగరికే రప్పించి రోజా చారిటబుల్ ట్రస్టు సహకారంతో ఇక్కడే ఆపరేషన్ కూడా చేసే వీలు కల్పించారు. దీంతో ఆర్థిక ఇబ్బందులు, ఆస్పత్రికి తీసుకెళ్లేవారు లేక సతమతమవుతున్న వారికి మంత్రి ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరం వరప్రదాయనిగా మారింది. పరీక్షలు చేసి స్పష్టమైన చూపు ఇవ్వడంతో పాటు అద్దాలు, మందులు ఉచితంగా అందించడం, భోజన సౌకర్యం కల్పించడం, అయినవాళ్లలా తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించడం, ఆపరేషన్ తరువాత ప్రపంచం వారికి నూతనంగా, స్పష్టంగా కనిపిస్తుండడంతో వారికి కనుల పండగలా మారింది.

అంధత్వ నివారణే లక్ష్యంగా..

పర్యాటక శాఖ మంత్రి రోజా నగరిలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన నేత్రవైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. వారం రోజులుగా జరుగుతున్న ఈ శిబిరంలో ఉదయం 8 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు 620 మందికి కంటి పరీక్షలు చేయగా వీరిలో 152 మందికి శిబిరం నిర్వహణా ప్రాంతంలోనే ప్రసిద్ధి గాంచిన మొబైల్ ఐ సర్జికల్ యూనిట్ ద్వారా ఆపరేషన్ చేశారు. బుధవారం రాత్రి వరకు ఈ క్యాంపు కొనసాగనుంది. ఉచితంగా వైద్యచికిత్స అందించడంతో పాటు రోగులకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం ట్రస్టు తరఫున అందిస్తున్నారు. నడవలేని దివ్యాంగులను, వయోవృద్ధులను సొంత బిడ్డల్లా ఎత్తుకెళ్లి వైద్యులు ఆపరేషన్ చేయడం మానవత్వానికి ప్రతీకగా నిలుస్తోంది.

రోజమ్మకు కృతజ్ఞతలు..



గతంలో ఇక్కడ ఎంతోమంది ఎమ్మెల్యేలు, మంత్రులు పాలించారు గానీ ఎవరూ మా వృద్ధుల గురించి పట్టించుకోలేదు. కానీ మంత్రి రోజమ్మ వైద్య శిబిరం పెట్టి కళ్లను పరీక్షించి ఇక్కడే ఆపరేషన్ చేసి, భోజనం పెట్టి మరీ పంపిస్తున్నారు. ఆపరేషన్ తర్వాత కంటి చూపు బాగా కనబడుతోంది. రోజమ్మకు, వైద్య బృందానికి కృతజ్ఞతలు
– నామదేవరెడ్డి, ఎలకాటూరు నింద్ర మండలం

మంత్రి రోజా చలవే..



చాలాకాలంగా కంటి చూపు మందగించి సరిగా కనిపించడం లేదు. వృద్ధాప్యం, ఆర్థిక పరిస్థితుల కారణంగా ఆస్పత్రికి వెళ్లి పరీక్షించుకోలేని పరిస్థితి. ఈ పరిస్థితుల్లో నేనున్న ప్రాంతానికి సమీపంలో మంత్రి రోజా నివాసం వద్ద కంటి పరీక్షలు చేస్తారని తెలిసి ఇక్కడకు వచ్చాను. ఉచితంగా ఆపరేషన్ చేసి కంటిలోని పొరను తొలగించారు. ఇప్పుడు కళ్లు బాగా కనిపిస్తున్నాయంటే ఇదంతా మంత్రి రోజమ్మ చలవే. – మునిరత్నం రెడ్డి, కరకంతాపురం, నగరి

సొంత కూతురిలా సాయపడింది



కన్న కూతురు తల్లికి ఎలా సాయం చేస్తుందో నాకు మంత్రి రోజా అందించిన సాయం అలాంటిదే. ఈ వృద్ధాప్య దశలో చెన్నై, తిరుపతికి కంటి పరీక్షలకు ఒకసారి, ఆపరేషన్‌కు ఒకసారి వెళ్లే పరిస్థితి నాది. ఈ తరుణంలో మంత్రి రోజా ఏర్పాటు చేసిన వైద్యశిబిరం గురించి తెలియవచ్చింది. ఇక్కడ రూ.లక్ష ఖర్చయ్యే ఆపరేషన్‌ను ఉచితంగా చేశారు. కన్నకూతురిలా మంత్రి రోజా నా యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.
– ఏలమ్మ, మేలపట్టు, నగరి మండలం

సాయం అందించే గుణం రోజాది..



సాయం అందించే గుణం మంత్రి రోజాకు భగవంతుడు ఇచ్చిన వరం. అందుకే మా లాంటి వారికి మేలు జరుగుతోంది. వృద్ధాప్యంలో కంటి చూపు మందగించి మా పనులు మేము చేసుకోవడం కూడా కష్టం. అలాంటి మాకు రోజమ్మ చలవతో ఉచితంగా కంటి ఆపరేషన్ చేసి మందులు, అద్దాలు ఇవ్వడంతో పాటు భోజనం కూడా పెట్టి బాగా చూసుకున్నారు. ఈ సాయం వెలకట్టలేని సాయం.
– సదాశివాచారి, వెంగళత్తూరు, పిచ్చాటూరు

భగవంతుని ఆశీస్సులు ఉండాలి..



మాలాంటి అభాగ్యులు ఎందరికో సాయపడుతున్న మంత్రి రోజాకు భగవంతుని ఆశీస్సులు మెండుగా ఉంటుంది. నేడు ఇంతమంది వృద్ధులు ఎలాంటి కష్టాలు అనుభవించక ఆపరేషన్ చేసుకుని వెళ్తున్నారంటే అది మామూలు విషయం కాదు. కలకాలం ఆమె పలువురికి సాయం అందించే స్థానంలోనే ఉండాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నా.
– నర్సమ్మ, ఆరూరు, నింద్ర మండలం

క్లుప్తంగా

అవగాహన ర్యాలీ



నింద్రలో ఆడుదాం ఆంధ్రా అవగాహన ర్యాలీ

నింద్ర: ఆడుదాం ఆంధ్రా క్రీడలపై అవగాహన ర్యాలీ మండల కేంద్రమైన నింద్రలో మంగళవారం నిర్వహించారు. విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని ఎంపీడీఓ అరుణ అన్నారు. రాష్ట్రప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు ఈ అవకాశం కల్పించిందని, దీన్ని ప్రతిఒక్కరూ పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయం నుంచి స్థానిక బస్టాండ్ వరకు జరిగిన ఈ ర్యాలీలో విద్యార్థులు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హనుమాన్ ప్రచార రథం ఊరేగింపు



నింద్ర: హనుమాన్ ప్రచార రథానికి పూజలు చేస్తున్న భక్తులు

నింద్ర: మండల కేంద్రం నింద్రలో మంగళవారం తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన హనుమాన్ రథాన్ని గ్రామంలో ఘనంగా ఊరేగించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ధర్మప్రచార సభ్యులు మాట్లాడుతూ తిరుపతిలో 13వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అఖండ హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బాబురెడ్డి, టీటీడీ ధర్మప్రచార సభ్యులు పాల్గొన్నారు.

మొబైల్ బుక్ కీపింగ్‌పై అవగాహన



మాట్లాడుతున్న ఐకేపీ ఏపీఎం పరిద్ మస్తాన్

పాలసముద్రం : ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అందిస్తున్న రుణాలను పొదుపు మహిళలు సక్రమంగా వినియోగించుకోవడంతో పాటు మొబైల్ బుక్ కీపింగ్ సక్రమంగా నిర్వహించాలని ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్ తెలిపారు. మంగళవారం స్త్రీశక్తి భవనంలో మండల సమాఖ్య సభ్యులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొబైల్ బుక్ కీపింగ్‌ను వందశాతం పూర్తి చేయాలని తెలిపారు. గ్రూపులు విధిగా 15 తేదీన సంబంధిత సంఘమిత్రాలు సమావేశం నిర్వహించాలని సూచించారు. స్త్రీనిధి రికవరీలు పూర్తిగా వసూలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీసీ చిరంజీవి, సంఘమిత్రాలు మురగయ్య, మంజుల, శోభ, వీవో లీడర్లు పాల్గొన్నారు.

క్యాలెండర్ విడుదల

పుత్తూరు: ఏపీజీఈఏ పుత్తూరు తాలూకా యూనిట్ వారు రూపొందించిన 2024 ఏడాది క్యాలెండర్‌ను మంగళవారం స్థానిక తహసీల్దార్ జె.పరమేశ్వరస్వామి ఆవిష్కరించారు. కార్యక్రమంలో పుత్తూరు యూనిట్ అధ్యక్షుడు రవికుమార్, నాయకులు రవిచంద్ర, గురుస్వామి, మునికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

పుత్తూరు: రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఒకటో వార్డు కొత్తతిమ్మాపురంలోని ఎంపీపీఎస్ స్కూల్‌లో బుధవారం ప్రారంభిస్తున్నట్లు కమిషనర్ కెఎల్ఎన్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో గైనకాలజీ, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్, జనరల్ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆరేటమ్మ ఆలయంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న దాతలు

పుత్తూరు: గ్రామ దేవత ఆరేటమ్మ ఆలయంలో మంగళవారం ప్రదోష త్రయోదశిని పురస్కరించుకుని అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. చెర్లోపల్లి గ్రామానికి చెందిన రామయ్య, వరలక్ష్మి, లోకేష్, యువరాజు ఉభయదాతలుగా వ్యవహరించారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేపట్టారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొనగా, వారికి అన్నప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ కె.మనోహర్‌రెడ్డి పర్యవేక్షించారు.

ధర్మయ్యకు నివాళి



ధర్మయ్య మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

కార్వేటినగరం: మండల పరిధిలోని సురేంద్రనగరం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ధర్మయ్య(62) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి గ్రామానికి వెళ్లి ధర్మయ్య మృతదేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. అలాగే వారి కుటుంబాన్ని ఓదార్చారు. అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ విజయానికి ధర్మయ్య అహర్నిశలు కృషి చేశారని గుర్తు తెలిపారు. అలాగే మండల పరిధిలోని ఆళత్తూరుకు చెందిన నాగయ్య(72) అనారోగ్యంతో మృతి చెందడంతో గ్రామానికి వెళ్లి మృతదేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారి వెంట జేసీఎస్ కన్వీనర్ పురంధర్, సురేంద్రనగరం సర్పంచ్ పెరియస్వామిరెడ్డి, మాజీ సర్పంచ్ వేల్‌రెడ్డి, గంగిరెడ్డి, రమణ, ప్రభాకర్‌రాజు, బాబురెడ్డి పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి

పిచ్చాటూరు: మండలంలోని శివగిరి ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయుడు పి.మురళీమోహన్ గుండెపోటుతో మంగళవారం మృతి చెందారు. కుటుంబ సభ్యుల కథనం మేరకు నింద్ర మండలం కావనూరుకు చెందిన ఆయన పట్టణంలోని టీచర్స్ కాలనీలో నివాసం ఉంటున్నారు. మంగళవారం తెల్లవారు జామున 5 గంటలకు గుండె పోటు వచ్చింది. భార్య, చుట్టుపక్కల వారు చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

పోస్టర్ విడుదల

పుత్తూరు: అన్ని వర్గాలకు సామాజిక న్యాయం చేస్తున్న ఏకైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. వడమాలపేటలో దళిత నాయకులతో కలసి బీఆర్ అంబేడ్కర్ మహా శిల్పావిష్కరణ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 19న విజయవాడలో ఏర్పాటు చేసిన 125 అడుగుల అంబేడ్కర్ మహా శిల్పాన్ని ముఖ్యమంత్రి జగనన్న ఆవిష్కరిస్తారని తెలిపారు. ప్రతిఒక్కరూ అంబేడ్కర్ బాటలో నడుస్తూ రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి రోజా

ఘనంగా ప్రదోష కాల పూజలు



నందీశ్వరుడికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎన్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం ప్రదోషకాల పూజలు ఘనంగా జరిగింది. ఈసందర్భంగా శివునికి నందీశ్వరునికి ఏకకాలంలో అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. అంతకుముందు వేకువజామునే కొండమల్లీశునికి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. సాయంత్రం నందీశ్వరునికి పాలు, పెరుగు, పసుపు, కుంకుమ, గంధకంతో పాటు నారకేళి జలాలతో అభిషేకాలు చేపట్టారు. సుంగధ పరిమళాలతో కూడిన పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ప్రదోష పూజలనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. ఇందులో భాగంగా ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు.

అలరించిన అష్టలక్ష్ముల ప్రదర్శన

నగరి : ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం వారు సంక్రాంతి పండుగను పురస్కరించుకుని స్థానిక ఏజేఎస్ కల్యాణ మండపంలో నిర్వహించిన ద్వాదశ జ్యోతిర్లింగ ప్రదర్శన అందరినీ అలరించింది. ఈ సందర్భంగా స్థానిక విద్యార్థులు అష్టలక్ష్మి వేషధారణలో చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. నిర్వాహకులు ధ్యానం ద్వారా కలిగే లాభాలను వీక్షించే వారికి ఉపదేశించారు.



అష్టలక్ష్మి అవతారంలో విద్యార్థులు

వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా యువరాజు



వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులను అభినందిస్తున్న మురళీ మోహన్

కార్వేటినగరం: వాకర్స్ అసోసియేషన్ కార్వేటినగరం అధ్యక్షుడిగా యువరాజును నియమించినట్లు వాకర్స్ అసోసియేషన్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు మురళీమోహన్ తెలిపారు. మంగళవారం మండలకేంద్రంలో ఆయన ఆధ్వర్యంలో వాకర్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరం అసోసియేషన్ అధ్యక్షుడిగా యువరాజు, కార్యదర్శిగా గురువర్మను నియమించినట్లు చెప్పారు. అనంతరం నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ త్వరలోనే నూతన కమిటీ సభ్యులను ఎంపిక చేసి అసోసియేషన్‌ను రిజిస్టర్ చేస్తామన్నారు. అనంతరం ఇంటర్నేషనల్ అధ్యక్షుడు మురళీ మోహన్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి ప్రదీప్‌కుమార్, డాక్టర్ రవిరాజు, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

పాపిరెడ్డిపల్లిలో ఏరువాక



వ్యవసాయ ప్రదర్శనను తిలకిస్తున్న అధికారులు, శాస్త్రవేత్తలు

గంగాధర నెల్లూరు: తిరుపతి ఎస్వీ వ్యవసాయ కళాశాలకు చెందిన విద్యార్థులు గంగాధర నెల్లూరు మండలం పాపిరెడ్డిపల్లిలో వ్యవసాయ ప్రదర్శనతో పాటు ఏరువాక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను అధికారులు పరిశీలించారు. వాటి గురించి కాలేజీ విద్యార్థులకు ప్రశ్నలు సంధించి వారి నుంచి సమాధానాలు రాబట్టారు. కార్యక్రమంలో ఎస్వీ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా.ప్రభాకర్ రెడ్డి, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఎడిటర్ డా.అరుణ, జిలా ఉద్యానవన అధికారి మధుసూదన్ రెడ్డి, ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డా.రెడ్డి, నగరి ఏడీ సౌభాగ్యలక్ష్మి, ఎస్వీ కళాశాల ఏడీ డా.జోత్స్న, ఏఓ వందన, శాస్త్రవేత్తలు, సర్పంచ్, ఎంపీటీసీ, వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

దహన క్రియలకు ఆర్థిక సాయం



నివాళులు అర్పిస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

పుత్తూరు: ఆత్మీయులను కోల్పోయిన వారి కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా సోదరుడు వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి భరోసా ఇచ్చారు. పుత్తూరు పట్టణ పరిధిలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మునిరత్నం రెడ్డి భార్య అలిమేలమ్మ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులకు రోజా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. అన్ని వేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ హేమలత, ఎంఎల్‌ఓ దిలీప్, నాయకులు గాంధీ, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు పింఛన్ల పంపిణీ



పింఛన్లు అందజేస్తున్న సర్పంచ్‌లు

శ్రీరంగరాజపురం: మండలంలోని తయ్యూరు గ్రామ సచివాలయంలో కొత్తగా మంజూరైన పింఛన్లను సర్పంచ్‌లు వరదమ్మ, ఉమామహేశ్వరి అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వృద్ధులు, వితంతువులకు సీఎం జగనన్న తోడుగా నిలుస్తున్నాడని చెప్పారు. చెప్పిన మాట ప్రకారం పింఛన్‌ను రూ.3 వేలకు పెంచి అభాగ్యులకు అండగా నిలిచినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జనార్దన్, మణి, బాబు, సుధాకర్, తంబి, ఆనంద్, ఉమాపతి, వెల్ఫేర్ అసిస్టెంట్ ఉమాదేవి పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష..పేదలకు వరం




ఎస్ఆర్‌పురం: మందులు అందజేస్తున్న అధికారులు, పాలసముద్రం: కంటి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

శ్రీరంగరాజపురం: జగనన్న ఆరోగ్య సురక్ష పేదల పాలిట వరమని నోడల్ అధికారి రవిరాజు అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తపల్లె జెడ్పీ హైస్కూల్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలందరికీ ఆరోగ్య సేవలను అందుబాటులో ఉంచి తద్వారా మెరుగైన సేవలు అందించడమే ప్రధాన లక్ష్యమన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం రోగులకు వైద్యసేవలు అందించి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సరిత, సర్పంచ్ డిల్లయ్య, తహసీల్దార్ బెన్నురాజు, ఎంపీడీఓ కృష్ణయ్య, వైద్యాధికారి బాలసుబ్రమణ్యం రెడ్డి, నియోజకవర్గ కాపు సంఘం అధ్యక్షుడు విజయబాబు, నాయకులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. మంగళవారం బలిజకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో రెండోవిడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మోహన్‌కృష్ణ మాట్లాడుతూ శిబిరంలో 311 మందికి డాక్టర్లు వైద్యసేవలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు తహసీల్దార్ బాబు, విస్తరణాధికారి రమేష్, సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎం, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో సీఎం జగనన్న



మాట్లాడుతున్న నాయకులు

పాలసముద్రం : దేశ రాజకీయాల్లో ప్రజాసంకల్ప యాత్ర ఒక సువర్ణ అధ్యాయమని జెడ్పీటీసీ సభ్యుడు అన్భళగన్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, మండల కన్వీనర్ తులసి యాదవ్ తెలిపారు. మంగళవారం ప్రజాసంకల్పయాత్ర నేటితో ఐదేళ్లు పూర్తి చేసుకున్న రోజు కావడంతో వారు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగనన్న ప్రజల గుండెల్లో నిలిచ్చారని తెలిపారు. ప్రజలు బాగుండాలనే ఉద్దేశంతోనే సీఎం జగనన్న ఇన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గాలి మహేష్ బాబు, ఎంపీటీసీ గోవిందరాజ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి ఎస్టీయూ వజ్రోత్సవాలు

పుత్తూరు: కర్నూలులో ఈనెల 12 నుంచి రెండు రోజుల పాటు ఎస్టీయూ వజ్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏ.హేమచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక మెయిన్ స్కూల్‌లో వజ్రోత్సవాల పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఎస్టీయూ ఆవిర్భవించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వజ్రోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొలి నుంచి ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేస్తున్న ఏకైక సంఘం ఎస్టీయూ అన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు వజ్రోత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు జయచంద్రన్, జిల్లా నాయకులు పవన్‌కుమార్‌రెడ్డి, శ్రీనివా



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్టీయూ నాయకులు

ప్రతిభను వెలికి తీసేందుకే ఆడుదాం.. ఆంధ్రా

కార్వేటినగరం: ఆడుదాం..ఆంధ్రా క్రీడలను గ్రామీణ క్రీడాకారులు సద్వినియోగం చేసుకుని జాతీయ క్రీడాకారులుగా ఎదగాలని ఎంపీపీ లత అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఎంపీడీఓ మోహన్‌మురళి ఆధ్వర్యంలో ఆడుదాం..ఆంధ్రా క్రీడలకు సంబంధించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గతంలో సచివాలయ స్థాయిలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన జట్లు మండల స్థాయి పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓలు విజయకుమార్, మనోజ్‌కుమార్, ఈఓ మణి, పీడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం : గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఎంపీడీఓ రామనాథరెడ్డి తెలిపారు. మంగళవారం వెంగళరాజుకుప్పం హైస్కూల్ విద్యార్థులతో కలసి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి సంబంధించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ రామనాథరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడం, పోటీతత్వాన్ని పెంపొందించే దిశగా ప్రణాళిక రూపొందించిందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు రాజేంద్రప్రసాద్, గిరిజ, హెచ్ఎం మీనాక్షి, విస్తరణాధికారి రమేష్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరులో..

గంగాధర నెల్లూరు: మండలకేంద్రంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సుధాకర్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. బుధవారం నుంచి మండలస్థాయిలో జరగనున్న మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలు జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయం నుంచి బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సుధాకర్, వైస్ ఎంపీపీ హరిబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి మండల స్థాయి పోటీలు

వెదురుకుప్పం: మండల స్థాయిలో బుధవారం నుంచి ఆడుదాం ఆంధ్రా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన జట్లు మండల స్థాయి పోటీల్లో పాల్గొంటాయన్నారు.

పుత్తూరులో..

పుత్తూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం.. ఆంధ్రా మండల స్థాయి పోటీలు బుధవారం నుంచి ప్రారంభమవుతాయని మున్సిపల్ కమిషనర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో, గేట్‌పుత్తూరులోని జెడ్పీ హైస్కూల్ గ్రౌండ్స్‌లో పోటీలు జరుగుతాయన్నారు. ఉదయం 9 గంటలకు మున్సిపల్ చైర్మన్ ఏ.హరి పోటీలను ప్రారంభిస్తారని, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, ఇతర అధికారులు, క్రీడాకారులు హాజరు కావాలని అందులో కోరారు.





కార్వేటినగరం: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు, పాలసముద్రంలో.., గంగాధరనెల్లూరులో..